క్లుప్తంగా

7న చిత్తూరులో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో కొంగారెడ్డిపల్లెలోని తమ కళాశాలలో ఈనెల 7న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్, చెన్నైకు చెందిన పేరొందిన కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, గత విద్యా సంవత్సరంలో పాసైన డిగ్రీ, ఇంజినీరింగ్, ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94932 10966 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఓం శక్తి పూజలు



మేల్‌మరవత్తూర్‌కు బయలుదేరుతున్న ఓం శక్తి భక్తులు

ఐరాల: మండలంలోని చిన్నవెంకటంపల్లెలో ఆదివారం గంగమ్మ ఆలయంలో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఓం శక్తి పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఆలయ నిర్వాహకుడు భరత్ ఆధ్వర్యంలో మహిళా భక్తులు ఇరుముడులతో మేల్‌మరవత్తూర్‌కు బయలుదేరారు. అమ్మవారికి ఇరుముడులు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటామన్నారు.

మలేషియాలో చౌడేపల్లె డాక్టర్‌కు సత్కారం



డాక్టర్ మురళీధర్‌ను సత్కరిస్తున్న మలేషియా ప్రతినిధులు

చౌడేపల్లె: మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిత్తూరు జిల్లా చౌడేపల్లె డాక్టర్ మురళీధర్, రైతు శ్రీరామగోపాల్‌కు ఘన సత్కారం లభించింది. హిందూ సంప్రదాయ పంచెకట్టుతో హాజరైన వీరిని అభినందించారు. బయోలిక్కర్ అధినేత డాక్టర్ అమరనాథ్, పేదలకు ఉచిత వైద్యసేవలందిస్తూ సమాజసేవలో కృషిచేస్తున్న దాత డాక్టర్ మురళీధర్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మలేషియా ఇండియన్ హైకమిషన్ చాన్సలర్ అమృతదాస్, మలేషియా ఆంధ్రా అసోషియేషన్ అధ్యక్షుడు బోలిశెట్టి శ్రీరామ్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ జగదీష్, హిమబిందు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్ ఆడుతున్న ఎంసీ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: మానసికోల్లాసం కోసం యువతకు క్రీడలు ఎంతో అవసరమని వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ 49 కొత్తపల్లిమిట్టలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్లు భువనేష్, యువరాజ్, తేజు ప్రసాద్, గిరిచౌదరి, లలిత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయానందరెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులతో ఆయన సరదాగా ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రీడాభివృద్ధికి ఎక్కువ నిధులను మంజూరు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించిందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డీవీ.ఢిల్లయ్య, నాయకులు విజయబాబు, కోటిరెడ్డిబాబు, దేవరాజులురెడ్డి, యుగంధర్, సుధాకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆగని రైళ్లు.. ప్రజలకు కన్నీళ్లు

జిల్లా కేంద్రంలో అన్ని రైళ్లకూ స్టాపింగ్ కల్పించాలనిని ప్రజలు ఎంతో కాలంగా కోరుతున్నా అది సాకారం కావడం లేదు. చిత్తూరు అటు తమిళనాడు ఇటు కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. దక్షిణాదికి, అటు ఉత్తరాది రాష్ట్రాలకు పలు రైళ్లు చిత్తూరు మీదుగా వెళ్తున్నా స్టాపింగ్స్ మాత్రం కలగా మారింది. ఆ రైళ్లను ఎక్కాలంటే తిరుపతి, కాట్పాడి, పాకాలకు వెళ్లి ఎక్కి ప్రయాణించాల్సిన దుస్థితి తప్పడం లేదు. ఇక్కడ స్టాపింగ్ కోసం ప్రధానంగా రైల్వే శాఖపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

- చిత్తూరులో స్టాపింగ్ లేని రైళ్లు
- రైళ్ల సంఖ్య పెరుగుతున్నా సాకారం కాని ప్రజల కల
- ఆ రైళ్లను ఎక్కాలంటే కాట్పాడి, తిరుపతికి వెళ్లాల్సిందే..!



చిత్తూరు రైల్వేస్టేషన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రవాసులకు వేలూరు, చెన్నై, బెంగళూరుకు వ్యాపార, ఉద్యోగ, బంధుత్వ రీత్యా ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. కానీ చిత్తూరు నుంచి నేరుగా రైళ్లలో వెళ్లే అవకాశం లేక పోయింది. ఈ సమస్యను గతంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రంలో పట్టు ఉందని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రజాప్రతినిధులు వంతు ఇప్పుడొచ్చింది. ఒత్తిడి తెచ్చి వివిధ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం తెస్తారా? అనేది ఇప్పుడు ప్రశ్న.

వస్తున్న సర్వీసులు

చిత్తూరు రైల్వేస్టేషన్ అందుబాటులో ఉండే సర్వీసులు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్–తివేంద్రం, న్యూఢిల్లీ–తివేంద్రం, కాకినాడ–బెంగళూరు, కాచిగూడ–చిత్తూరు, తిరుపతి–విల్లుపురం, పుణె–కన్యాకుమారి, తిరుపతి–మైసూర్.

చిత్తూరు మీదు వెళ్తున్న ఆపరా?

తిరుపతి–రామేశ్వరం, హౌరా–పాండిచ్చేరి, ఓకా–రామేశ్వరం, తిరుపతి–రామేశ్వరం, టాటా–యశ్వంత్‌పూర్ రైళ్లు చిత్తూరు మీదుగా వెళ్తున్న ఇక్కడ మాత్రం స్టాపింగ్ లేదు. ఈ రైళ్లలో వెళ్లాలంటే పాకాల లేదా తిరుపతికి వెళ్లి ఎక్కాల్సిందే.

రైల్వేస్టేషన్‌లో తిష్ట వేసిన సమస్యలు

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలను తెలుసుకోవడానికి విచారణ విభాగం పని చేయడం లేదు. ప్రయాణికులతో కొందరు సిబ్బంది అమర్యాదగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. వేలాది మంది ప్రయాణిస్తున్నా ఇక్కడ ఏటీఎం నిర్వహణ సరిగా లేదు. ఎక్కడ చూసినా పారిశుధ్య సమస్యలు కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి బురద..బురదగా మారుతోంది. స్టేషన్ ఆవరణలోని ఆటోవాలాలు ప్రయాణికులను రెండింతల ధరలతో దోచుకుంటున్నారు. పార్కు చిట్టడవిని తలపిస్తూ, మందుబాబులకు అడ్డాగా మారింది. పాదచారులు, వాహనదారుల సౌకర్యం కోసం అండర్ బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేయవచ్చు.

మందకొడిగా అమృత్ భారత్ పనులు

గత సంవత్సరం చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను దాదాపు రూ.14 కోట్లతో అమృత్ భారత్ పథకం కింద మొదలెట్టారు. పనులు మందకొడిగా సాగుతున్నాయి. ప్రస్తుతం 50 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. అరకొర పనులతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కు రాకపోకలు సాగించాలంటే ఒళ్లు హూనం అవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. దుమ్ముధూళి, దీనికి తోడు ఎక్కడ చూసిన మట్టి దిబ్బలు ఉండడంతో అవస్థలు తప్పడం లేదు. రోజూ సగటున 3600 మంది ప్రయాణికులు చిత్తూరు రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజు టికెట్, పార్శిల్ సర్వీసు, ఇతరత్రా ఆదాయం కలిపి రైల్వే స్టేషన్‌కు రూ.3 లక్షలు వస్తోంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన బస్టాండులో ఆదివారం వాణి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈవో పెంచల కిషోర్ దీనిని ప్రారంభించారు. మొత్తం 125 మందిని వైద్యులు పరీక్షించి మందులు, మాత్రలు అందజేశారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న ఎంపీడీఓ బాలాజి



పురస్కారం అందుకుంటున్న బాలాజి

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, పెద్దపంజాణి ఎంపీడీఓ పలమనేరు బాలాజీకి బీసీ సంఘర్షణ సమితి బహుజన సామాజిక రచయిత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, వీసీ సీహెచ్ అప్పారావు చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. వారు మాట్లాడుతూ, ఆదివాసీ ఎరుకల జీవితాలపై ఆయన రాసిన ఏకలవ్య కాలనీ ఎరుకుల జీవితాల్లోని ఉద్వేగాలను కళ్లకు కట్టేలా చూపిందన్నారు. నిర్వాహకులు లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది

- మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థినికి రూ.50వేల బహుమతి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం విద్యాసంస్థల్లో ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. గణితానికి మూలమైన తర్కం నిత్యజీవితానికి వినియోగపడుతుందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ, తాను చదువుకునే రోజుల్లో గణితంలో వెనుకబడ్డానని, అయితే అదే గణితం తోనే ఈ స్థాయికి వచ్చానన్నారు. ఏపీ గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు చంద్రమనాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో గణితంపై ఉండే భయాన్ని పోగొట్టి స్నేహ పూర్వక వాతావరణ ంలో గణితం నేర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బంగారుపాళ్యం మండలం మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని లహరి 'పై' విలువను 100 దశాంశ స్థానాల వరకు తెలియజేసింది. ఆ అమ్మాయిని, శిక్షణ ఇచ్చిన గురువు అరుణ శివప్రసాద్ ను ఎమ్మెల్యేలు అభినందించారు. లహరికి రూ.50 వేల నగదును, ఏపీ గణిత ఫోరం అసోషియేషన్ అభివృద్ధికి రూ.50 వేలు మొత్తం రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షులు జయంతి, ఫోరం సభ్యులు చంద్రశేఖర్, జవహర్ రెడ్డి, హెచ్‌ఎంలు శ్రీధర్‌బాబు, రమేష్, రఘు, జగన్నాథం, విజయం ప్రిన్సిపల్ జీవరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



లహరికి రూ.50 వేల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేలు

పరిశీలనలు సరే..సౌకర్యాలేవి సారూ!

- ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన డీపీటీఓ
- అధికారులను ప్రశ్నించిన ప్రయాణికులు

వి.కోట: పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం ఆర్టీసీ అధికారులు వస్తారు..బస్టాండును చూస్తారు.. అదిగో సీసీ రోడ్డు.. ఇదిగో మరుగుదొడ్లు అంటూ చెబుతారు..వెళ్తారు.. అంతే..ఆ తర్వాత చేసేది ఏమీ లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండును బాగుచేస్తారా, లేదా పరిశీలనలతోనే సరిపెట్టుకుంటారా సార్? అని ఆర్టీసీ అధికారులను ప్రయాణికులు ప్రశ్నించారు. ఆదివారం వి.కోట ఆర్టీసీ బస్టాండును చిత్తూరు జిల్లా డీపీటీఓ జగదీష్ అధికారులతో కలసి పరిశీలించారు. ఇది గమనించిన ప్రయాణికులు అధికారుల వద్దకు వచ్చి ప్రశ్నల వర్షం కురిపించారు. వారు మాట్లాడుతూ, అనతికాలంలో ఏర్పాటుచేసిన వి.కోట బస్టాండుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండు ఆవరణ మొత్తం కంకర్లు తేలి గుంతలమయమైందన్నారు. దీంతో వర్షం వస్తే నీటి కుంటలను తలపిస్తూ బస్టాండు మొత్తం బురద కుంటలుగా మారుతున్నాయన్నారు. అంతేకాక తాగునీరు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిసార్లు తెలిపినా అధికారులు స్పందించలేదని ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

అక్షర సాధనతో మార్కులు పదిలం

- మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం
- అక్షర దోషాలు, దిద్దుబాట్లు ఉండకూడదు
- పదో తరగతి విద్యార్థులకు చిట్కాలు

ఐరాల: పదో తరగతి విద్యార్థుల్లో తొలిసారి పబ్లిక్ పరీక్షలు అనగానే తెలియని భయం, ఆందోళన. ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తయితే మూడు గంటల్లో పరీక్షలో సక్రమంగా రాయడం మరో ఎత్తు. అన్ని సమాధానాలు తెలిసినా వాటిని మూడు గంటల్లో జవాబుపత్రంపై సమగ్రంగా రాయలేకపోతారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నకు వెంటనే జవాబులు చెప్పే విద్యార్థులు సైతం పరీక్షల్లో మాత్రం తడబాటుకు గురవుతుంటారు. ఫలితంగా మార్కుల సాధనలో వెనుకబడుతుంటారు. ఈ సమస్యను అధిగమిస్తే విజయం వారి సొంతమవుతుంది. మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు నిపుణులు పలు సూచనలు, సలహాలు.

జవాబులు స్పష్టంగా రాయాలి

ప్రశ్నలకు జవాబులను సూటిగా, స్పష్టంగా రాయాలి. వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి. చేతిరాత గుండ్రంగా అర్థమయ్యేలా ఉండాలి. మనం రాసే తీరు పరీక్ష పేపరు దిద్దేవారికి చికాకు తెప్పించేలా ఉండకూడదు.

అక్షరం బాగుంటే విజయం

ఓ విద్యార్థి చేతిరాతను బట్టి సంబంధిత విషయంపై అతని అవగాహన స్థాయిని చెప్పవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైనా వారనేది జవాబు పత్రాలు దిద్దేవారికి తెలియదు. వారు రాసే తీరు, అక్షరాల కూర్పును బట్టి వారి జ్ఞానాన్ని మదింపు చేస్తారు. ఈ విషయంలో చేతిరాతకూ ఎంతో ప్రాధాన్యం ఉంది. కళ్లకు ఇంపుగా కనిపించే అక్షరాలు వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారిని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది.

విద్యార్థులు చేసే పొరపాట్లు

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25 నుంచి 30 లైన్లు రాస్తారు. గజిబిజిగా దగ్గర దగ్గరగా ఉండడంతో జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16 నుంచి 18 లైన్లకు మించకుండా చూడాలి. లైన్లు సమాంతరంగా ఉండాలి. చాలామంది విద్యార్థులు బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు. పెన్నుని వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా ఉంటాయి. చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లిష్ జెడ్ తరహాలో, 5ను ఎస్‌లా, 0ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి. సైన్స్‌లో బొమ్మల్ని గీస్తే ఆ చిత్రంలోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమపద్ధతి పాటించాలి.



ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేతిరాత సాధన చేస్తున్న విద్యార్థులు

ఇలా రాస్తే మంచిది

ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయాలి. సమాధాన పత్రంలో పేజీకి 15 నుంచి 16 లైన్లు ఉండాలి. పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి. మొదటి వరుసలో ఎంత బాగా రాశారో చివరి వరకు అదే గుండ్రని అక్షరాలతో కొనసాగించాలి. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులలో లెటర్ రైటింగ్‌ను ఒక పేజీలో వచ్చేలా రాయాలి. గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు వేసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి. సాంఘిక శాస్త్రం సబ్జెక్టును సమాధానాలను పాయింట్ల వారీగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి. మంచి పెన్నులు ఉపయోగించాలి. అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.

తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలి



విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యే విధంగా చొరవ చూపాలి. అక్షరాలు గుండ్రంగా ఉంటే మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలామంది విద్యార్థులు కష్టపడి చదువుతారు కానీ బాగా రాయకపోవడంతో అనుకున్న మార్కులు సాధించలేకపోతున్నారు. అందుకే చిన్నతనం నుంచి అక్షర సాధనపై దృష్టి సారిస్తే మంచిది. –రుషేంద్రబాబు, ఎంఈఓ, ఐరాల

గుండ్రంగా రాస్తే మూల్యాంకనంలో ప్రాధాన్యం



గుండ్రంగా రాస్తే మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయాలి. అలాగని గుండ్రంగా రాయలేనివారు ఆందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. పరీక్షలలో ఉన్నంతలో మెరుగ్గా రాసే ప్రయత్నం చేస్తే మంచి మార్కులు వస్తాయి. –కోమల, హెచ్‌ఎం, ఐరాల

జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం వద్ద సాగుతున్న జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానికులు ఆదివారం ఆందోళన చేశారు. ఇదివరకే ఫ్యాక్టరీ ప్రారంభంలో స్థానికులు కార్యకలాపాల వల్ల అధిక శబ్దం, పంట పొలాలపై దుమ్ము చేరి తద్వారా ఆరోగ్యాలు పాడవుతాయని స్థానికులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. దీంతో కొన్ని రోజుల పాటు జెల్లీ ఫ్యాక్టరీని మూయించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానికులతో మాట్లాడి మళ్లీ ప్రారంభించారు. తాజాగా ఆదివారం మరోమారు ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఉన్న జనం పంట పొలాలు పాడవుతున్నాయని, అధిక శబ్దాలతో ఉండలేకపోతున్నామని ఆందోళన చేశారు. దీనిపై ఫ్యాక్టరీ యజమాని వివరణ కోరగా, తమకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, ఆందోళన చేస్తే చట్టప్రకారం వెళ్తామని అన్నారు.

స్వామి సేవలో తెలంగాణ అడిషనల్ డీజీపీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం తెలంగాణ అడిషనల్ డీజీపీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధరణిధర, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపులో బెల్ట్ వ్యాపారం!

గంగాధరనెల్లూరు: అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం గంగాధరనెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల వివరాలిలా ఉన్నాయి. జీడీనెల్లూరు తానా జంక్షన్ వద్ద చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఏలుమలై అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఏలుమలైను అదుపులోకి తీసుకుని 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చికెన్ షాపు ముసుగులో మద్యం విక్రయిస్తున్న దుకాణం

నేడు 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దీనిని గ్రామస్తులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు ఫిజియోథెరపీ సేవలు అందాలి

పుత్తూరు: పేదలకు సైతం ఫిజియోథెరపీ వైద్య సేవలు ఉచితంగా అందించాలని, ఇందుకు ప్రభుత్వం యువ ఫిజియోథెరపిస్టులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో నియమించాలని ప్రముఖ రిటైర్డ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక కేకేసీ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బ్యాచ్‌కు గ్రాడ్యుయేషన్ ఫంక్షన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, పుత్తూరు పట్టణం నుంచి తొలిసారిగా 22 మంది యువ ఫిజియోథెరపీ డాక్టర్లు సమాజంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. వీరిలో ముగ్గురు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించడం కేకేసీ కళాశాల ప్రమాణాలకు నిదర్శనమన్నారు. అయితే పట్టాలు అందుకొన్న యువ ఫిజియోథెరపిస్టులు కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లకు పరిమితం కాకుండా చిన్న చిన్న పట్టణాల్లో సైతం తమ సేవలందించాలని సూచించారు. ప్రముఖ చిల్డ్రన్స్ డాక్టర్ ఎ.ఆర్ముగం మాట్లాడుతూ, వైద్య వృత్తిలో సేవా దృక్పథంతో ఉండాలని, అప్పుడే అందరి మన్ననలు అందుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్లు ఎం.సురేష్ పద్మజ, కె.నరసింహారావు, మంజుల, కె.రవిశేఖర్, వైష్ణవి, ప్రిన్సిపల్ ఎంఎస్.మాగేష్, వైస్ ప్రిన్సిపల్ రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.



యువ ఫిజియోథెరపిస్టులతో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి